నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 మహబూబ్‌నగర్, సోమవారం 2 డిసెంబర్ 2024
MAHABUBNAGAR NARAYANPET

## పెట్టుబడి వచ్చేలా లేదు..



మూడెకరాలు కౌలుకు తీసుకొని మిరప సాగు చేశాను. పంటకు తెగులు సోకడంతో దిగుబడి పెరగడం లేదు. గతంలో ధరలు బాగా ఉండగా.. ఈ ఏడాది దిగుబడి తక్కువే.. ధరలు లేవు. కూలీ ఒకరికి రోజుకు రూ.400 వందలు చెల్లిస్తున్నాం. ఎకరాకు పెట్టుబడి రూ. లక్ష వరకు పెట్టాం. ధర లేకపోవడం.. కూలీ పెరగడంతో మిరప కోతకోయకుండా చెట్లపైనే వదిలేశా. ప్రభుత్వ పరంగా ఆదుకుంటే తప్పా రైతులు ఈ కష్టం నుంచి బయట పడే అవకాశం లేదు.
- రవి, రైతు, మిడిదొడ్డి



ధర లేకపోవడంతో పంట పొలాల్లో మిర్చిని ఆర బెడుతున్న రైతులు

# రైతు కంట్లో కారం

## ఘాటు తగ్గిన మిర్చి

- పంటకు సోకిన ఆకు ముడత తెగులు
- కలిసిరాని కాలం.. తగ్గిన దిగుబడి
- మార్కెట్‌లో పడి పోయిన ధరలు
- ఆందోళనలో మిరప రైతులు
- జోగుళాంబ గద్వాల జిల్లాలో 75,842 ఎకరాల్లో పంట సాగు

మిర్చి పంట రైతు కంట్లో కారం కొట్టింది. ప్రత్యేకమైన నడిగడ్డ భూముల్లో మిరప సాగు చేయగా.. ఆకుముడతతోపాటు ఇతర తెగులు సోకడం.. కాలం కలిసి రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పోయిన ఏడాది మిరప వేసిన రైతులు లాభాలు పొందగా.. ఈసారి కోటి ఆశలతో గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో పంట సాగు చేశారు. తెగుళ్ల బెడద.. కాలం కలిసిరాకపోవడం కర్షకన్న కంటిమీద కునుకులేకుండా చేసింది. దీంతో దిగుబడి లేక దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఈ ఏడాది 75,842 ఎకరాల్లో పంట సాగైంది. - గద్వాల, డిసెంబర్ 1

గతేడాది మిర్చి సాగు చేసిన రైతులు పంటకు ఆకు ముడత తెగులు సోకడంతో నష్టపోయారు. ఈ ఏడాదైనా లాభాలు రావా అనే గంపెడాశతో రైతులు ఈ వాన కాలం గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో జిల్లాలో పెద్ద ఎత్తున మిరప పంట సాగు చేశారు. అయితే ప్రస్తుతం మిర్చి సాగు చేసిన రైతుల కంట్లో కన్నీటి చుక్కలు కారుతున్నాయి. కాలం కలిసి రాకపోవడంతో ఏమి చేయాలో తోచడం లేదు. వేసిన పంటకు తెగుళ్ల పీడ ఉండడంతో రైతుకు ఈ పరిణామం కంటి మీద కునుకు లేకుండా చేసింది. పంటను నమ్ముకుని లాభాలు వస్తాయని అనుకున్న మిర్చి రైతులకు అప్పులు మిగిలేలా కనిపిస్తుంది. నడిగడ్డ భూములు మిర్చి సాగుకు అనుకూలం కావడంతో రైతులు 2024లో ఈ పంటను పెద్ద మొత్తంలో సాగు చేశారు. సాగు చేసిన రైతులకు పెట్టుబడి పోను ఏటా ఎకరాకూ



రూ.50 వేలపైనే ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రైతు పండించిన మిర్చిని అమ్మిన పెట్టిన పెట్టుబడికి సరిపోయే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం రైతులు సాగు చేసిన మిర్చి పంటకు ఆకు ముడత పురుగు, కొమ్మకుళ్లు, జెమిని వైరస్, పచ్చ, తెల్ల దోమ సోకడంతో పైరు ఎదకపోవడంతో పాటు దిగుబడి రాక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**తగ్గిన దిగుబడి..**

మిర్చి పంటలకు ఆకు ముడత పురుగుతో పాటు ఇతర వైరస్‌లు సోకడంతో దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. గతంలో ఎకరాకు సుమారు 20 క్వింటాళ్ల వరకు మిరపను రైతులు పండించేవారు. ప్రస్తుతం చీడ పీడలు సోకడంతో దిగుబడి కాస్తా 8 నుంచి 10 క్వింటాళ్లకు పడి పోయింది. 2022లో రైతులు ఎకరాకూ 20 క్వింటాళ్ల పంట పండించగా.. ధర కూడ ఎక్కువగా వచ్చింది. దీంతో మంచి లాభాలు రైతులు ఆర్జించారు. 2022-2023 సంవత్సరంలో గుంటూరు మిర్చి క్వింటా రూ.10 వేల నుంచి రూ.14 వేల వరకు బాడీ రకం రూ.15 వేల నుంచి రూ.35 వేల ధర పలికింది. ప్రస్తుతం దిగుబడి లేక పోవడం దాని ధర కూడా రూ.15 వేల నుంచి రూ.18వేలలోపు ఉండడంతో రైతులకు దిక్కు తోచడం లేదు. దీంతో ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### జిల్లాలో మిర్చిసాగు ఇలా..

జోగుళాంబ గద్వాల జిల్లాలోని భూములు మిర్చి సాగుకు అనుకూలంగా ఉండడంతో రైతులు ఈ పంటకు ఆసక్తి చూపుతారు. అలంపూర్, గద్వాల నియోజకవర్గాల్లోని మల్దకల్ ప్రాంతంలో ఎక్కువగా పంట సాగు చేస్తారు. ఏడాదికి ఏడాది సాగు జిల్లాలో పెరుగుతున్నా రైతులకు మాత్రం అనుకున్న స్థాయిలో లాభాలు రావడం లేదు. 2020లో 24,388, 2021లో 35,085, 2022లో 36,757 ఎకరాల్లో మిర్చి సాగు చేయగా.. మంచి లాభాలు వచ్చాయి. దీంతో 2023లో 65,115, 2024లో 75,842 ఎకరాల్లో పంట సాగైంది. అయితే రైతులు ఎక్కువగా సాగు చేయడంతో తెగులు సోకడం, అనుకున్న స్థాయిలో ధరలు లేక పోవడం, దిగుబడి తగ్గడంతో పెట్టుబడి వస్తే చాలు అనే ఆలోచనలో



రైతులు ఉన్నారు. ప్రభుత్వపరంగా చేయూతనిచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

### తెగులు సోకి దిగుబడి తగ్గింది..



మిర్చి పంటకు కొమ్మకుళ్లు, ఆకు ముడత జెమిని వైరస్ ఆశించడంతో ఎకరాకూ 10 క్వింటాళ్ల దిగుబడి కూడా రావడం లేదు. గతేడాదితో పోల్చితే సాగుపెరిగినప్పటికీ దిగుబడి లేదు. ధరలు తగ్గాయి. దీంతో పెట్టుబడి వస్తుందో..? లేదో? అని ఆందోళనలో ఉన్నాం. ఎకరాకు రూ. 20 వేలు కౌలుకు తీసుకొని నాలుగు ఎకరాలు మిరప సాగు చేశాను. ప్రస్తుతం కౌలుపోయి పెట్టుబడి వస్తే చాలు అనుకుంటున్నా. ధర లేనందుకు పొలంలోనే పంటను ఆరబెట్టా. ధర పెరుగుతుందని చాలా మంది రైతులు పొలాల వద్దనే ఆర బెట్టారు. ధర పెరిగితే లాభాలు.. లేదంటే నష్టాలే..
- ఈరన్న, రైతు, బింగిదొడ్డి

### కన్నీరు తప్పడం లేదు..



మిర్చికి ధర బాగుందని ఆశతో వాన కాలంలో నాలుగు ఎకరాలోల మిరప సాగు చేశాను. ఎకరకూ కౌలు కలుపుకొని సుమారు రూ.1.50 లక్షల దాకా పెట్టుబడి వచ్చింది. గతేడాది గుంటూరు రకానికి రూ.20 వేల పైన ధర ఉండేది. ప్రస్తుతం రూ.15 వేలు దాటడం లేదు. ఎకరాకు 20 క్వింటాళ్లపైనే దిగుబడి వస్తుండేది.. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కేవలం 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుంది. గతంలో క్వింటాకు రూ.35 వేల ధర రాగా.. ఏసారి రూ.18 వేలు దాటడం లేదు. గతంలో ఉన్న ధరలను పోల్చుకొని సాగు పెంచితే ధరల్లేవు.. అనుకున్న స్థాయిలో దిగుబడి లేదు. దీంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.
- పరశురాం, రైతు, ఉప్పల




వెల్దండ వద్ద కేఎల్ఐ కాల్వకు గండిపడి వృథాగా పోతున్న నీళ్లు

## గండి.. గండం

- పదోసారి కోతకు గురైన కేఎల్ఐ డీ-82 కాల్వ
- నాసిరకం పనులే కారణం
- వృథా అవుతున్న సాగునీరు

వెల్దండ, డిసెంబర్ 1 : కేఎల్ఐ డీ-82 క్వాలకు గండీ గండం పట్టుకున్నది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికే దాదాపు పదిసార్లు గండి పడింది. మండలంలోని గుండాల-వెల్దండ సమీపంలో కేఎల్ఐ డీ-82 కాల్వకు మళ్లీ గండి పడింది. ఆదివారం తెల్లవారుజామున కాల్వ తెగడంతో సాగునీళ్లు వృథాగా పారుతున్నాయి. ఈ వానకాలం ఆరంభం తర్వాత 10సార్లు కాల్వకు గండి పడిందని స్థానికులు చెబుతున్నారు. గండి పూడ్చడంతో నాణ్యత లేక గండి పడ్డ చోటే మళ్లీ కాల్వ తెగిపోతుందని ఆరోపిస్తున్నారు. అయితే కాల్వ తెగిపోవడంతో సాగునీరు వృథాగా పోతుండడంతో కాల్వకు దిగువనున్న పంటలు మునిగి నష్టపోయో ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాల్వ కు తరచూ గండ్లు పడకుండా శాశ్వత పరిష్కారం దిశగా మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.



కల్వకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చెట్ల కింద భోజనాలు చేస్తున్న విద్యార్థులు

# చెట్లకిందే.. మధ్యాహ్న భోజనం

- నిధులలేమీతో అసంపూర్తిగా డైనింగ్, కిచెన్ గదులు
- అటకెక్కిన మన ఊరు-మన బడి పనులు
- చేసిన పనులకు బిల్లుల్లేక రోడ్డునపడ్డ కాంట్రాక్టర్లు
- కల్వకుర్తి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇక్కట్లు

కల్వకుర్తి, డిసెంబర్ 1 : మాగనూర్ ఘటనలు కళ్ల ముందు కదలాడుతున్న ప్రభుత్వ యంత్రాంగంలో చలనం లేదనే విమర్శలు బాహటంగా వినిపిస్తున్నారు. ఆరు బయట వండటం, నాసిరకం బియ్యం, వంటసామగ్రి, కలుషిత నీరు వినియోగించడం తదతర కారణాలతో పాఠశాలల్లో వండుతున్న మధ్యాహ్న భోజనంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగనీయొద్దనే ఎప్పటికప్పుడు వంట ఏజెన్సీలకు బిల్లులు చెల్లిస్తూ, సన్న బియ్యాన్ని సరఫరా చేసింది. మన ఊరు-మన బడి పథకం కింద వంట గదులు, మిషన్ భగీరథ స్వచ్ఛమైన నీరు, విద్యార్థులు కూర్చొని తీనేందుకు వీలుగా డైనింగ్ హాల్‌లను నిర్మించేందుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మన ఊరు- మన బడి పథకం అటకెక్కింది. నిధుల లేమీతో డైనింగ్, వంట గదుల నిర్మాణం, మిషన్ భగీరథ ట్యాంకుల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి వంట ఏజెన్సీలకు సకాలంలో బిల్లులు రాక అరిగోస పడుతున్నారు. పేద, బడుగు, బల హీన వర్గాలు చదువకుంటున్న పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కడుపునింపలేకపోతుంది.

**కల్వకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..**

కల్వకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడిమంలో దాదాపు 500మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో చాలామంది విద్యార్థులు బీసీ, ఎస్సీ వసతిగృహాల్లో చదువుకుంటున్న వారితోపాటు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు విద్యనభ్యసిస్తూన్నారు. వీరు మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే చేస్తున్నారు.

**కేసీఆర్ ప్రభుత్వంలో..**

కల్వకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు, సంతృప్తిగా కూర్చుని భోజనం చేసేందుకు వీలుగా డైనింగ్ హాల్, ఆధునిక వసతులతో కూడిన వంట గది, ప్లేట్లు కడుక్కోవడానికి వాషింగ్ ఏరియా, సింక్‌లు, తాగడానికి మిషన్ భగీరథ ట్యాంకు, నల్లాల ఏర్పాటుకు దాదాపు రూ.37లక్షల నిధులను కేటాయించి పనులను ప్రారంభించింది. పనులు సగం వరకు పూర్తి కాగానే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మన ఊరు-మన బడి పథకానికి నిధులు కేటాయించకపోడంతో పనులు ఆగిపోయాయి. చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లు రోడ్డున పడ్డారు. పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజన విషయంలో ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. ఆరుబయట వంట, చెట్ల కింద భోజనాలు, దూరంగా పైప్ వేసుకుని పైప్‌ద్వారా వచ్చే నీటితో ప్లేట్లు కడుక్కోవడం షరా మామూలుగా మారింది.

**వంట ఏజెన్సీలకు ఇబ్బందులు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి వంట ఏజెన్సీలకు సంకటంగా మారింది. డబ్బులు నెల నెల రాక పోవడంతో వంట సామగ్రికి అప్పు చేయాలి. అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఎప్పుడో ఒక నెలకు సంబంధించి డబ్బులు వస్తే ప్రసాదం పంచినట్లే అవుతుందని వంట ఏజెన్సీ మహిళలు వాపోతున్నారు. వంట సామగ్రి రేట్లు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వంట చేస్తే కనీసం కూలీ గిట్టుబాటు అవుతుందని అనుకుంటే.. అసలుకే మోసం వస్తుందని వంట ఏజెన్సీ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడ్డు ధర బహిరంగ మార్కెట్‌లో రూ.7ఉంటే మాకు మాత్రం రూ.5 చెల్లించడంతో రూ.2 నష్టం వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పైప్ వేసుకొని ప్లేట్లు కడుక్కుంటున్న విద్యార్థులు



నల్లాలు బిగించక నిరుపయోగంగా ఉన్న వాష్‌బేసిన్లు

## బీఆర్ఎస్వీ నేతల గురుకుల బాట

- పాల మూరులోని వసతి గృహాల సందర్శన
- సమస్యలు ఏకరువు పెట్టిన విద్యార్థినులు
- పరిష్కరించాలని డిమాండ్



కలెక్టర్ బంగ్లా సమీపంలోని వసతి గృహం విద్యార్థినులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 1 : బీఆర్ఎస్ చేపట్టిన గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం కలెక్టర్ బంగ్లా వద్ద ఉన్న బీసీ గర్ల్స్ హాస్టల్, టీచర్స్ కాలనీలోని బీసీ హాస్టల్‌ను నాయకులు సందర్శించారు. ఆయా వసతిగృహాల్లో మంచినీరు, భోజనం, వసతి సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని రికార్డు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్ గడ్డం భరత్‌బాబు మాట్లాడుతూ టీచర్స్‌కాలనీలోని బీసీ హాస్టల్ భవనంలో మొత్తం 308 మందికి ఇరుకుగా గదులు ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కలెక్టర్ బంగ్లా సమీపంలోని వసతి గృహంలో విద్యార్థినులకు బెడ్‌షీట్లు అందించలేదని, ఒక్కో గదిలో 35 మంది ఉంటున్నారని తెలిపారు. మున్సిపాలిటీ నుంచి సరఫరా చేస్తున్న నీటిని ఫిల్టర్ చేయకుండానే అందిస్తున్నారని, మున్సిపల్ డ్రైనేజీ పరిశుభ్రంగా లేకపోవడంతో నిత్యం దోమలబెడద ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ పట్టణ ప్రెసిడెంట్ సత్య పాల్, వైస్ ప్రెసిడెంట్ గణేశ్, మనీశ్‌గౌడ్, తిరుమ లేశాయుడు, రామకృష్ణ, శ్రీకాంత్, రాజగోపాల్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## రగ్బీ చాంపియన్ పాలమూరు




రగ్బీలో చాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంటున్న పాలమూరు బాలుర జట్టు

- ముగిసిన రాష్ట్రస్థాయి టోర్నీ
- సత్తాచాటిన బాలబాలికల జట్లు

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 1 : జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ అండర్-14 రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీ ఆదివారం ముగిసింది. బాల బాలికల విభాగాల్లో పాలమూరు జట్లు చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో రన్నరప్‌గా రంగారెడ్డి, బాలుర రన్నరప్‌గా నల్లగొండ జట్లు నిలిచాయి. బాలుర, బాలికల్లో మెదక్ మూడో స్థానానికి పరిమితమైంది.

**హోరాహోరీగా ఫైనల్ మ్యాచ్..**

మహబూబ్‌నగర్-రంగారెడ్డి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. చివరి వరకు సాగిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 02-00 పాయింట్ల తేడాతో రంగారెడ్డి జట్టుపై విజయం సాధించింది. బాలుర ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ 2-1 పాయింట్ల తేడాతో నల్లగొండపై గెలుపొందింది. అనంతరం ఏఎంవో దూకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రగ్బీ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఐకమత్యంతో జాతీయస్థాయిలో విజయం సాధించాలన్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి ఫైనల్ మ్యాచ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి, రగ్బీ టోర్నీ అర్గనైజింగ్ సెక్రటరీ నిరంజన్‌రావు, టోర్నీ రాష్ట్ర పరిశీలకుడు కిష్టయ్య, పేటా టీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్, యోగా సంఘం జిల్లా కార్యదర్శి బాల రాజు పీడీలు బాల రాజు, వేణుగోపాల్ వడెన్న, పరశురాం, స్వప్న, నర్సింహులు, మేరీపుష్ప పాల్గొన్నారు.



కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్న విండో డైరెక్టర్ మాసన్న

## కేసీఆర్ పాలనే ప్రజలకు శ్రీరామరక్ష

- కాంగ్రెస్ ఏడాది పాలనకే ప్రజల్లో వ్యతిరేకత
- ఆరు గ్యారెంటీలంటూ నిండా ముంచేశారు
- దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

దేవరకద్ర రూరల్ (చిన్న చింతకుంట), డిసెంబర్ 1 : కొట్లాడి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని పదేండ్లు సస్య శ్యామలంగా కేసీఆర్ మార్చి శ్రీరామరక్షగా ఉన్నారని, ఏడాది పాలనలోనే కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో వ్యతిరేకత మూటగట్టుకున్నదని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం చిన్న చింతకుంట మండలం ఉంద్యాలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ మాసన్న, కప్పెరి వెంకటయ్య తోపాటు పలువురు నేతలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఆల గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని, ఆరు గ్యారెంటీలంటూ ఒక్క హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. కేసీఆర్ రైతులకు అండగా నిలిచి రైతుబంధు ద్వారా పంటసాయం అందించగా, కాంగ్రెస్ సర్కారు మాత్రం రైతుల నోట్లో మట్టి కొడుతూ పథకాన్ని ఎత్తేసే ప్రయత్నం చేస్తున్నదన్నారు. ఏడాదిలోనే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంతో విసిగిపోయారని, మళ్లీ కేసీఆర్ పాలన కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. అన్నివర్గాల వారిని రేవంత్‌రెడ్డి అబద్ధపు హామీలతో నిండా ముంచారన్నారు. ఆరు గ్యారెంటీను అమలు చేయడం చేతగాక వ్యక్తిగత విమర్శలతో కాలయాపన చేస్తూ తెలంగాణ ఆత్మ గౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాము, నేతలు పాల్గొన్నారు.

## మత్తు మందు వికటించి మహిళ మృతి

- వైద్యులే కారణమంటూ దవాఖాన ఎదుట ఆందోళన

గద్వాల అర్బన్, డిసెంబర్ 1 : మత్తు మందు వికటించి మహిళ మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం.. అయిజకు చెందిన కవిత శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉండడంతో గత నెల 26న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లింది. పరీక్షించిన వైద్యుడు ఆపరేషన్ చేయాలని, ఇక్కడ సరైన సదుపాయం లేదని ప్రైవేట్ దవాఖానను ఆశ్రయించాలని సూచించారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని శివబాలాజీ దవాఖాన వైద్యులను కవిత ఆశ్రయించింది. వైద్యులు పరీక్షించి 28వ తేదీన ఆపరేషన్ చేసేందుకు మత్తు సూది ఇచ్చారు. దీంతో కవితకు ఫిట్స్ వచ్చి పరిస్థితి విషమించింది. వెంటనే కర్నూల్‌కు దవాఖానకు తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించడంతో అక్కడి వెళ్లగా పరీక్షించిన వైద్యులు మెదడులో నరాలు చిట్లి కోమాలోకి వెళ్లినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం మృతిచెందింది. కవిత మృతికి కారణమైన శివ బాలాజీ దవాఖాన ఎదుట బాధిత కుటుంబ సభ్యులు న్యాయం చేయాలని కోరుతూ నిరసన చేపట్టారు.




గద్వాలలో దవాఖాన ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కవిత బంధువులు